క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలను దేవాదాయశాఖ సిబ్బంది శనివారం లెక్కించారు. చదురు గుడి హుండీ ద్వారా రూ.1,10,028లు, వనం గుడి హుండీ ద్వారా రూ.97,888లు ఆదాయం సమకూరింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి వీవీ సూర్యనారాయణ, సాలూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి టి.రమేష్, శంబర ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఆలయ ఆశాదీలు, సిబ్బంది, సేవలకు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

బలిజిపేట: నిరుపేద కుటుంబానికి దాతల సహకారంతో రూ.10వేలు ఆర్థిక సాయం అందించినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు తెలిపారు. బొబ్బిలి పట్టణానికి చెందిన వూన్న బాబురావు కుటుంబం నిరుపేద జీవితాన్ని గడుపుతున్నారు. వారికి జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతూ ఆకలికేకలతో అలమటిస్తున్నారని తెలిపారు. వారి సహాయార్థం గ్రామానికి చెందిన జి.హరనాథ్ రూ.4,500, టి.రమేష్ రూ.2వేలు, జి.శంకరరావు రూ.2వేలు, ఎ.సత్యం రూ.1,000, ఆర్.మురళి రూ.500లు చొప్పున మానవతా దృక్పథంతో సాయం చేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని బాబురావు కుటుంబానికి అందించామని సంజీవినాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

పొలం గట్లపై పంటల సాగు



జయంతిరాయపురంలో పొలంగట్టుపై సాగుచేస్తున్న కంది పంట

సీతానగరం: రైతులు వరిచేను గట్లపై ఇతర పంటలు సాగుచేయడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని బగ్గందొరవలస, చిన భోగిలి, రంగంపేట, పణుకుపేట, గాదెలవలస, దయానిధిపురం, జయంతిరాయపురం గ్రామాల్లో రైతులు పొలం గట్లపై సాగు చేస్తున్న కూరగాయలు, కంది పంటలను శనివారం ఆయన పరిశీలించారు. పొలం గట్లను ఖాళీగా వదిలేయకుండా కూరగాయలు, పప్పుదినుసులు సాగుచేయడం ద్వారా కుటుంబ అవసరాలు తీరుతాయన్నారు. రైతులు ఈ దిశగా దృష్టిసారించాలని సూచించారు.

బెల్ట్‌షాపులపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న సీఐ పద్మావతి

సీతానగరం: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలపై సచివాలయ మహిళా పోలీసులు నిఘా పెట్టాలని, బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే సమాచారం అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి అన్నారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం మండల పరిధిలో ఉన్న సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహించిన, సారా అమ్మకాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అపరిచితులకు బ్యాంకు వివరాలు చెప్పొద్దు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు చెప్పవద్దని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. మండలంలోని గుజ్జుపాడు గ్రామంలోని గ్రామస్తులకు సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్లు, లక్కీ డ్రా పేరిట సైబర్ నేరగాళ్లు మోసానికి పాల్పడతారని, వారి వలలో పడవద్దన్నారు. అలాగే యువత చెడు వ్యవసనాలకు అలవాటు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు. యువతీ, యువకులు కూడా మత్తు పదార్థాలు, లేనిపోని ఎంజాయ్‌మెంట్‌లకు అలవాటు పడొద్దని, ఉన్నతమైన ఆలోచన విధానంతో మంచిగా జీవించాలని తెలిపారు.

దర్జాగా కబ్జా..



ఆక్రమణకు గురైనట్లు చెపుతున్న ప్రభుత్వ స్థలం

- ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు
- కూటమి నేతల అండతో రెచ్చిపోతున్న ఆక్రమణదారులు
- పట్టించుకోని మున్సిపల్, రెవెన్యూ అధికారులు

సాలూరు: కాదేదీ ఆక్రమణలకు అనర్హం అన్న చందాన మున్సిపాలిటీలో కొందరు ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. తమ కన్ను పడిన ప్రాంతంలో చెరువులు, కాలువలు, ప్రభుత్వ స్థలాలు, దేవాదాయ భూములను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమార్కులకు కూటమి నేతల అండదండలు ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టణంలో బంగారమ్మ కాలనీలో విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. ఎలాంటి అనుమతులు లేకుండా అందులో నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్ వెళ్తున్న ప్రదేశానికి ఇరువైపులా సర్వే నంబరు 206/2లో గల సుమారు 70 సెంట్లు స్థలాన్ని పట్టణ అవసరాలకు కేటాయించారు. దీన్ని ప్రొహిబిషన్ ప్రాంతంగా మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఈ స్థలంలో సుమారు సగం ప్రాంతం ఆక్రమణకు గురైంది. గతంలో ఇదే స్థలంలో కొంతమంది రాజకీయ నాయకులు తమ పలుకుబడితో ఇళ్ల నిర్మాణాలకు పూనుకోగా అధికారులు అడ్డుకుని, ఇది ప్రభుత్వ స్థలమని అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. ఆక్రమణ విషయం నాడు ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర దృష్టికి వెళ్లగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని సదరు ఆక్రమణదారులకు ఆయన హెచ్చరించారు. ఆయన హెచ్చరికలతో ఆక్రమ నిర్మాణాలు నిలిచిపోయాయి.

కాగా నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు ఆక్రమణదారులు తిరిగి అక్కడకు చేరి యథేచ్ఛగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక నాయకుడు ఈ స్థలాన్ని విక్రయించినట్లు నిర్మాణదారులు చెపుతున్నట్లు సమాచారం. గతంలో ఇక్కడ ఇంటి నిర్మాణానికి బిల్లు తీయగా, తరువాత అది ప్రభుత్వ భూమని తెలియడంతో హౌసింగ్ అధికారులు బిల్లులు నిలుపుదల చేసినట్లు సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం పనిచేసిన తహసీల్దార్ సంతకాలతో నకిలీ ఇంటి పట్టాలు తీసుకుని, ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లా కలెక్టర్‌కు, సీబీఐకి ప్రముఖ న్యాయవాది రేగు మహేశ్వరరావు, సామాజిక కార్యకర్త నైన హరిరెడ్డి ఫిర్యాదు చేశారు. కాగా నాడు నిలిచిన పనులు నేడు కూటమి ప్రభుత్వంలో మరలా ప్రారంభమయ్యాయి. దీని వెనుక కూటమి ముఖ్య నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయని, అందుకే ఈ ఆక్రమణలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దీనిపై తహసీల్దార్ వెంకటరమణను వివరణ కోరగా ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. ఏదేమైనా ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు తక్షణమే స్పందించాలని, లేకుంటే ఈ ఆక్రమణల పర్వం మున్సిపాలిటీలో మిగిలిన ప్రాంతాలకు విస్తరించే ప్రమాదం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఈ వ్యవహారంపై అటు రెవెన్యూ, ఇటు మున్సిపల్ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని, దీని వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే వార్డులో సొంత గూడు లేక పలువురు పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, పెద్ద నాయకులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్లు కట్టుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు.

వీడీవీకేల ఏర్పాటుకు స్థలాలు గుర్తించండి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



పార్వతీపురంటౌన్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలో చేతివృత్తుల కళాకారుల బజార్లు, గోకులాలు, వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశోతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో చేతివృత్తుల బజార్లు, వీడీవీకేలు, మల్టీపర్పస్ సెంటర్లు, గోకులాలపై సంబంధిత అధికారులతో పీఓ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించే దిశగా ప్రత్యేక బజార్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వన్ ధన్ వికాస కేంద్రాలు, బహుళ ప్రయోజన కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధికల్పనతో పాటు ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

గోకులాలను ఏర్పాటు చేసి వాటితో ఆర్థిక ప్రయోజనం పొందే దిశగా ప్రోత్సహించనున్నట్లు ఆయన వివరించారు. వీటి ఏర్పాటు కోసం అవసరమైన స్థలాలను గుర్తించాలని, ఏర్పాటు చేశాక అవి వినియోగంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పీఓ కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఏపీడీ వెలుగు, ఏపీఎంలు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కరుణాకర్

సీతానగరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు కృషిచేయాలని మండల ప్రత్యేకాధికారి కరుణాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖ ఏఈ జానకీరాం అధ్యక్షతన శనివారం గృహ నిర్మాణాలపై తహసీల్దార్ ఉమామహేశ్వరరావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులు ఆరాతీశారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, విద్యుదీకరణ, తదితర మౌలిక వసతులు కల్పనపై అధికారులు దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లు, వంతెనలు పూర్తిచేయండి



మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: మండలంలో జిల్లేడువలస, కరడావలస, పడాలవలస గ్రామాల రోడ్డును, వెలగవలస వంతెన నిర్మాణం వేగవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లేడువలసలో ఆయన మాట్లాడుతూ, గిరిజనులను ఓట్లు కోసం చూస్తున్నారే తప్ప వారి కనీస అవసరాలను ప్రభుత్వం తీర్చడం లేదని విమర్శించారు. రోడ్లు లేకపోవడంతో ఈ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే రోడ్లు, వంతెన పనులు పూర్తిచేయాలని కోరారు. ఆయనతో పాటు నాయకులు మర్రి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలేవీ..?



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ రూరల్: ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సీపీఎం మండల కన్వీనర్ దావాల రమణారావు ప్రశ్నించారు. మండలంలోని నాగావళి నదీతీరం వెంబడి గల గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంతెనలు, తాగునీటి వనరులకు దాదాపు ఐదు వందల మీటర్ల దూరంలో తవ్వకాలు చేపట్టకూడదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, అక్రమార్కులు లెక్క చేయడం లేదన్నారు. మంగళాపురం సమీపంలో వంతెన దిగువ వందల ట్రాక్టర్లతో ఇసుక తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈయన వెంట ఆ సంఘ నాయకులు మజ్జి వీరన్నాయుడు, కాద రాము, చంద్రశేఖర్, గోగుల నరేష్, తదితరులున్నారు.

ఉద్యోగుల భద్రతే లక్ష్యం

– ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల భద్రతే లక్ష్యంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) అడుగులు వేస్తోందని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పాలకొండలో నూతనంగా నిర్మించిన కార్యాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కొంతమంది అధికారుల అలసత్వం కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కొత్త బస్సుల ఆవశ్యకత, అలవెన్సులు, దీర్ఘకాల సమస్యలను అధిగమించేందుకు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 7వ తేదీన విజయవాడలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కోశాధికారి సీవీపీ మోహన్, కార్యదర్శి ఆర్.నరసింహులు, జోనల్ కార్యదర్శి సూర్యరాములు, నాగరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎన్ఎంయూ నాయకులు పాల్గొన్నారు.

పశుగణనకు పాడిరైతులు సహకరించాలి



పశుగణన రికార్డులను పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్



మాట్లాడుతున్న డాక్టర్ మన్మథరావు

సీతానగరం: జాతీయ స్థాయిలో చేపట్టిన పశుగణన కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రజలు సహకరించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మన్మథరావు కోరారు. సీతానగరం పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ పర్యవేక్షణలో మండలంలోని బుడ్డిపేట, లక్ష్మీపురం, సీతానగరం గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరగాల్సిన పశుగణన అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. ఈ ఏడాది 2024 అక్టోబరు 25 నుంచి జాతీయ స్థాయిలో పశుగణన ప్రారంభమైందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పశువైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పాడిపశువుల వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. పాడిరైతులు పశుగణన సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా బుడ్డిపేటలో పాలసేకరణ కేంద్రం ఏర్పాటు చేయాలని పాల ఉత్పత్తిదారులు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా జేడీ ఆఫీస్ ఏడీ డాక్టర్ ప్రసాద్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు, పశువైద్యశాఖ సహాయకులు, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

చురుగ్గా పశుగణన

సీతానగరం: జిల్లాలో పశుగణన చురుగ్గా జరుగుతోందని, పశుగణన సిబ్బందికి పాడిరైతులు సహకరించాలని సబ్‌డివిజనల్ పశుసంవర్ధకశాఖ ఏడీ సీహెచ్ దీనకుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో 21వ పశుగణన కార్యక్రమం అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు జరుగుతుందన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని బలిజిపేట, సీతానగరం మండలాల్లో నల్ల పశువులు 3,432, తెల్ల పశువులు 37,830 ఉన్నాయన్నారు. అలాగే గొర్రెలు, మేకలు 63,239, కోళ్లు 1,36,801, పందులు 2,048 ఉన్నాయన్నారు. వాటన్నింటినీ లెక్కించనున్నట్లు చెప్పారు.

ఉచిత వినికిడి యంత్రాల కోసం 27 మంది ఎంపిక



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయపార్వతి

పార్వతీపురంటౌన్: వినికిడి సమస్యతో ఇబ్బందిపడుతున్న వారికి జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ విజయపార్వతి శనివారం ఈ శిబిరాన్ని సందర్శించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్, విజయవాడ వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వినికిడి సమస్య ఉన్న వారికి అవసరమైన వినికిడి యంత్రాలను ఈ ఫౌండేషన ద్వారా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పుట్టుకతో గానీ, ఎదుగుదల క్రమంలో గానీ వినికిడి సమస్య, ఇతర లోపాలు ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్సను అందించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్ మట్లాడుతూ.. ఈ శిబిరంలో డీఈఐసీ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ భరత్ చంద్ర, ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కోటేశ్వరరావు బృందం ఆరోగ్య తనిఖీలు చేపట్టరన్నాని తెలిపారు.

18 ఏళ్ల లోపు 39 మందికి తనిఖీలు చేపట్టగా 13 మందిని, 18 ఏళ్ల పైబడిన వాళ్లు 74 మందికి తనిఖీలు నిర్వహించగా 14 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొత్తం ఈ 27 మందికి ఫౌండేషన్ వారు ఉచితంగా వినికిడి యంత్రాలను త్వరలో అందజేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, విజయనగరం ఆర్‌బీఎస్‌కే మేనేజర్లు పి.లోక్‌నాథ్, ప్రశాంత్, డీఈఐసీ వైద్యాధికారులు డాక్టర్ లలిత దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజమే మనందరి లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై ఎం.రాజేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఖైనీ, గుట్కా, గుటుంబా, తంబాకు, గంజాయి, వంటి మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారుఉ. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పట్టణ సుందరీకరణ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణ సుందరీకరణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలోని కొత్తవీధిలో స్థానికులకు 'స్వచ్ఛ సుందర పార్వతీపురం' కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం సుందరీకరణలో ప్రజలందరి భాగస్వామ్యం అవసరమన్నారు. ప్లాస్టిక్ రహిత సంచులను ప్రజలంతా వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలను ప్రజలకు వివరించారు. పట్టణ సుందరీకరణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ వాసులంతా వార్డుల్లో, తమ సమీపంలో కేటాయించిన చెత్తబుట్టల్లోనే చెత్తను వేయాలని కోరారు. ప్రతీ రోజు ఉదయం వస్తున్న వాహనాలకు తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ దీపారాధన



పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వెలిగించిన అఖండ జ్యోతి

సాలూరు: కార్తికమాసం ప్రారంభంకావడంతో పట్టణంలోని శివాలయాలు, దేవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పంచముఖేశ్వరస్వామి, కామాక్షమ్మ ఆలయాల్లో అఖండ జ్యోతిని వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నదీ స్నానానికి వెళ్లేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా నదికి వెళ్లే దారిని బాగుచేశారు.

సమస్యలపై దశలవారీ పోరాటం..

సీతంపేట: సమస్యలపై దశలవారీ పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు స్పష్టం చేశారు. మండలంలోని రామానగరం, గోలుకుప్పగూడలలో శనివారం సీపీఎం మహాసభలు నిర్వహించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. గిరిజన సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన తప్పదన్నారు. అలాగే నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.